క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న భద్రతా బలగాలు

తడ: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం కేంద్ర భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. ట్రైనీ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో 60 మంది సిబ్బంది కారూరు, కాశింగాడుకుప్పం, రామాపురం, రామాపురం కుప్పం, వెంటాద్రి పాళెం గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజల్లో మానసిక ధైర్యం నింపారు. వీరితోపాటు నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షిస్తున్న వైద్యులు

దొరవారిసత్రం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 175 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. 50 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేసి తిరుపతికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిబాబా, క్లబ్ సభ్యులు దశరథరెడ్డి, సురేష్, శ్రీరెడ్డి, నరసింహారావు, శివకుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో అమ్మవారి జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



విరాళం ఇస్తున్న సెల్వరాజ్

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గూడూరుకు చెందిన ఏ సెల్వరాజ్ రూ.50 వేల విరాళాన్ని ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫ్లెక్సీల తొలగింపు



నాయకుల ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

వెంకటగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వెంకటగిరి పట్టణంలో రాజకీయల పార్టీల ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియను అధికారులు, సిబ్బంది వేగవంతం చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే 25 వార్డుల్లోని ఫ్లెక్సీలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి వాహనాల్లో తీసుకువెళ్లారు. అదేవిధంగా పట్టణంలోని పలుచోట్ల అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. రూ.50 వేలకంటే ఎక్కువ నగదును రవాణా చేస్తే సరైన ధృవీకరణ పత్రాలు, బిల్లులు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శనివారం సాయంత్రం నుంచే మున్సిపాలిటీ సిబ్బంది రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు ముసుగు వేశారు. కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలను పూర్తి స్థాయిలో తొలగిస్తున్నామన్నారు. నాయకులు విగ్రహాలకు ముసుగు వేస్తున్నట్లు వెల్లడించారు.

ఆశీర్వదించండి.. సేవకుడిలా పనిచేస్తా

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పోలేరమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేసి ఫాదర్ ఇమానుయేలుబాబు నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. పట్టణంలోని జామియా పెద్ద మసీదులో ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో గత ఏడాదిన్నర కాలంగా వెంకటగిరిలో పలు అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. గతంలో తమ తల్లిదండ్రులు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి వెంకటగిరి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఇప్పుడు తనను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జి ఢిల్లీబాబు, వెంకటగిరి రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాదా జానకిరామయ్య, మైనారిటీ నాయకుడు యస్దానిబాషా, వైస్ చైర్మన్ బాలయ్య, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ధనియాల రాధ, కందాటి కళ్యాణి, వహిదా, కల్లు మల్లీశ్వరి, సుకన్య, వక్ఫ్‌బోర్డు మెంబర్ తాజుద్దీన్, మాజీ కౌన్సిలర్ గౌస్‌బాషా పాల్గొన్నారు.



లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న నేదురుమల్లి

బాలసదన్‌లో నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని రాణిపేటలో ఉన్న బాలసదన్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. అక్కడి వసతుల గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు అంటే తనకు ఎంతో ఇష్టమని, తనను వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మొదటిసారిగా బాలసదన్‌లోని చిన్నారులతో కలవాలనే ఉద్దేశంతో వచ్చినట్టు తెలిపారు. చిన్నారులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఆయనకు చిన్నారులు ఆల్ ద బెస్ట్ అని శుభాకాంక్షలు తెలిపారు.





జామియా మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, బాలసదన్ చిన్నారులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెలికంటిని పరామర్శించిన నేదురుమల్లి



వెలికంటి రమణారెడ్డితో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): డక్కిలి మండల వైఎస్సార్ సీపీ నేత, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ వెలికంటి రమణారెడ్డిని ఆదివారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, డక్కిలి మండల సొసైటీ అధ్యక్షుడు ఘట్టమనేని శ్రీనివాసులునాయుడు, వేణునాయుడు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, ఆదిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఇందులో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట: జాతీయ క్రీడోత్సవాల్లో భాగంగా సీవీ రామన్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సీఐ శ్రీనివాసులురెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జెడ్పీ క్రీడా మైదానం వరకు సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపి మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడానికి ర్యాలీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, ఖాదరబాబు, మేనేజర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్యామ్ యాదవ్

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణంలోని అడివయ్యకాలనీలో ఉన్న గాడ్ గ్రేస్ సొసైటీ అనాథాశ్రమంలో ఆదివారం శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు, ఆశ్రమ నిర్వాహకులు బాషా జాన్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

నాయుడుపేట: పదవ తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు విద్యాశాఖ అధికారి బాణాల మునిరత్నం తెలిపారు. నాయుడుపేటలో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, నారాయణ, జెడ్పీ ఎల్ఏ సాగరం, బాలుర గురుకుల పాఠశాల, సెయింట్ మేరీస్ పాఠశాలల్లో 835 మంది బాలురు, 840 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

రాపూరు..

రాపూరు: మండలంలో సోమవారం నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 201 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 220 మంది, కండలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 117 మంది పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్: పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరిలో 1,240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వారి కోసం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్వీఎం, సెయింట్ ఫెన్సిస్, ఏపీ మోడల్ స్కూల్, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, విశ్వోదయ జూనియర్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు.

కోటలో..

కోట: పదో తరగతి పరీక్షల కోసం మండలంలో ఆరుకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. కోట జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత, ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలలు, విద్యానగర్ బాలభారతి, చిట్టేడు హైస్కూల్‌లో సెంటర్లు ఏర్పాటుచేశామని తెలిపారు. ఇక్కడ మొత్తం 1,106 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 806 మంది, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 300 మంది ఉన్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

దొరవారిసత్రం: కలగుంట సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు..పాళెంపాడుకు చెందిన ప్రవీణ్ బైక్‌పై నాయుడుపేటకు వెళ్లి తిరిగి బయలుదేరాడు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాదాసు గంగాధరం తదితరులు

కలువాయి: కుల్లూరులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మాదాసు గంగాధరం తెలిపారు. ఆయన ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఆలయ ట్రస్టీ వెలిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ మంగళవారం విష్వక్సేన పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బుధవారం స్వామివారి శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాదాసు గంగాధరం, నళినమ్మ, మాదాసు యజ్ఞపవన్, అపర్ణ దంపతులు వ్యవహరిస్తారని తెలిపారు. 21వ తేదీ ఏకాంతసేవ నిర్వహిస్తామన్నారు.

కొత్తపాళెంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సంబరాలు



కొత్తపాళెంలో హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు

కోట: వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మేరిగ మురళీధర్‌ను ప్రకటించడంపై కోట మండలం కొత్తపాళెంలో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. వారు ఆదివారం గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. జగనన్నను తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి, సర్పంచ్ ప్రసన్న, గోపాల్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, గాలి శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరత్నం

రాపూరు: రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ వెంకటరత్నం కోరారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించినట్టు తెలిపారు. ఎవరైనా సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. రూ 50 వేల లోపు మాత్రమే నగదు బట్వాడా చేయవచ్చని, అంతకుమించి తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సునంద పాల్గొన్నారు.

కండలేరులో 8.780 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 8.780 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జగనన్నకు మహిళలే కొండంత అండ



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- నాయుడుపేటలో ప్రచారం

నాయుడుపేట టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలే కొండంత అండ అని, ఆయనను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడం తథ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక నాయకులతో కలిసి నాయుడుపేటలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ ప్రద్యుమ్న కుమార్ రెడ్డి నివాసం వద్ద నాయుడుపేట, పెళ్లకూరు తదితర ప్రాంతాలకు చెందిన మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. జరిగిన మంచిని గుర్తు పెట్టుకుని ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశాల్లో ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నాయకులు పోట్లాపూడి రాజేష్, బాబి, రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

సమష్టిగా సమరానికి సిద్ధం

నాయుడుపేట టౌన్: ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా సమరానికి సిద్ధం కావాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. పండ్లూరు వద్ద ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అంటే ఒకే కుటుంబమని, ఎవరినైనా నొప్పించి ఉంటే మన్నించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన ఉన్నారని, పెత్తందార్ల వైపు నిలబడిన ప్రతిపక్షాలు అపవిత్ర కూటమిగా ఏర్పడి గుంపుగా వస్తున్నాయన్నారు. ఎవరెన్ని కూటములు కట్టినా గెలుపు వైఎస్సార్‌సీపీదేనని స్పష్టం చేశారు. కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవయ్య విజయం కోసం సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. తాను వైఎస్సార్‌సీపీని వీడుతున్నట్లు అసత్య ప్రచారం చేశారని, ఎప్పటికీ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గతంలో టీడీపీ నేతలు తమ కుటుంబంపై కక్ష కట్టి అక్రమ కేసులతో తీవ్రంగా ఇబ్బంది పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆత్మీయ సమావేశానికి నాయుడుపేట, ఓజిలి తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు భారీగా తరలిరావడంపై హర్షం వ్యక్తం చేశారు. సంజీవయ్య, గురుమూర్తి విజయాన్ని ఎవరూ ఆపలేరని వెల్లడించారు. సమావేశంలో నేతలు ముమ్మడి సుబ్బారావు యాదవ్, ఎంపీపీ ధనలక్ష్మీ, జెడ్పీటీసీ కట్టా జ్యోతి రెడ్డి, పండ్లూరు సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కిషోర్ యాదవ్, నాయకులు వి.లక్ష్మీనారాయణ రెడ్డి, కలికి మాధవ రెడ్డి, కట్టా భవాని శంకర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, నల్లు కస్తురయ్య వాకాటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో టీడీపీకి భారీ షాక్

- పార్టీని వీడిన వేనాటి రామచంద్రారెడ్డి
- లోకేష్ జోక్యాన్ని భరించలేకే దూరం..



సూళ్లూరుపేట: సూళ్లూరుపేట టీడీపీకి వేనాటి వారి రూపంలో కోలుకోలేని షాక్ తగిలింది. పార్టీలో లోకేష్ జోక్యాన్ని భరించలేక సీనియర్ నాయకుడు వేనాటి రామచంద్రారెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీకి 42 ఏళ్లుగా వెన్నుదన్నుగా ఉన్న వేనాటి వారే బయటికి వచ్చారనంటే ఆ పార్టీలో కుల రాజకీయాలు ఏలా వున్నాయో ఊహించుకోవచ్చు. టీడీపీకి కార్యనిర్వాహక కార్యదర్శిగా, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా, టీటీడీ బోర్డు సభ్యులుగా పనిచేసిన వేనాటి రామచంద్రారెడ్డి లోకేష్ ఆడుతున్న కుల రాజకీయాలతో అక్కడ ఇమడలేకపోయారు. ఆయన శనివారం సాయంత్రం సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వేనాటి వారు సూళ్లూరుపేట నియోజకవర్గంలో 1983 నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులను నిర్ణయించి గెలిపిస్తూ టీడీపీకి కంచుకోటగా మార్చారు. నేడు వేనాటి రామచంద్రారెడ్డి ఆ పార్టీని వీడడం పెద్ద షాక్ అని అందరూ అంటున్నారు. వేనాటి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో పార్టీలో కుల పిచ్చి ఉండేది కాదన్నారు. నేడు అది పెచ్చుమీరిందన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఏకపక్షంగా ఎంపిక చేయడమే అందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు గాని, ఆయన కుమారుడు లోకేష్ గాని సీనియర్లకు కనీసం ఒక్కమాట కూడా చెప్పకుండా టికెట్ ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. విలువలులేని చోట మనుగడ సాగించలేమనే ఉద్దేశంతోనే బయటికి వచ్చినట్టు తెలిపారు. పార్టీలో లోకేష్ పెత్తనం పెరిగిందని, డబ్బులు తీసుకుని టికెట్ ఇచ్చే స్థాయికి దిగజారిపోయారని ఆరోపించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అనుచరులతో మాట్లాడి తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చాడంటే మడమ తిప్పని నైజం వుండడంతో ఆ పార్టీలో చేరి సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. దీంతో టీడీపీలో గుబులు పట్టుకుంది. సూళ్లూరుపేట టీడీపీ కంచుకోటను బద్దలు చేసిన వైఎస్సార్ సీపీ రానున్న ఎన్నికల్లో మూడో సారి కూడా విజయ కేతనాన్ని ఎగురవేయనుంది.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్ల పంపిణీ



కూరగాయలు అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెలా 3వ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దాత ఒగ్గు భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, అశోక్, విష్ణు, జగదీష్, మధు, సుబ్రమణ్యం, శ్రీనివాసాచారి, సురేష్, మురళీసింగ్, రెడ్ సంస్థ అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధం అంటున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత
- కార్యకర్తలతో సమావేశం

వెంకటగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి మహిళా కార్యకర్తా పనిచేయాలని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆదివారం వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుర్రా మాధవి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో సైతం మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మరెన్నో పథకాలు అందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని సూచించారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుర్రా మాధవి మాట్లాడుతూ సీఎం జగనన్న పరిపాలనలో జరిగిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేసి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళ, జోనస్ ఇన్‌చార్జి రత్నకుమారి, రాష్ట్ర అధికార ప్రతినిధి దేవికాచౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాటూరు రామతులసి, కౌన్సిలర్లు ధనియాల రాధ, పి.లక్ష్మి, కళ్యాణి, వహిదా పాల్గొన్నారు.